నమస్తే తెలంగాణ
రంగారెడ్డి
I హైదరాబాద్, సోమవారం 7 ఏప్రిల్ 2025 RANGAREDDY



పొలాల నుంచి తాగునీరు తెచ్చుకుంటున్న ఊటుపల్లి తండా మహిళలు

## గుక్కెడు నీటి కోసం..

దోమ, ఏప్రిల్ 6 : మండలంలోని ఊటుపల్లి గ్రామపంచాయతీ అనుబంధ గ్రామమైన ఊటుపల్లితండా వాసులు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గుక్కెడు నీటి కోసం పంట పొలాల బాట పడుతున్నారు. కొన్ని రోజులుగా తండాలో ఉన్న బోరులో భూగర్భజలాలు తగ్గిపోయాయి. మోటర్ ఆన్ చేసినప్పుడల్లా పది బిందెల వరకు నీరు వచ్చి ఆగిపోతున్నది. దీంతో తండాలో ఉన్న వారి అవసరాలకు ఆ నీరు సరిపోవడంలేదు. ఖాళీ బిందెలను పట్టుకుని పొలాలకు వెళ్తున్నారు. వాడుకునేందుకు సరిపడా నీరు లేక ఇబ్బందిపడుతున్నామని సంబంధిత శాఖ అధికారులకు చెప్పినా పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## ప్రశాంతంగా శోభాయాత్ర

సిటీబ్యూరో, ఏప్రిల్ 6 (నమస్తే తెలంగాణ): అడుగడుగునా పోలీసు నిఘా మధ్య హైదరాబాద్‌లో శ్రీరామనవమి శోభాయాత్ర భక్తజనం నీరాజనాల మధ్య కనులపండువగా ముగిసింది. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీబందోబస్తు నిర్వహించారు. సీతారాంబాగ్ వద్ద మొదలైన శోభాయాత్ర హనుమాన్ వ్యాయామశాల వరకు ప్రశాంతంగా జరిగింది. హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ ప్రత్యక్ష పర్యవేక్షణలో ఈ యాత్ర బందోబస్తును నిర్వహించారు. సుమారు 20వేల మంది పోలీసులు ఈ బందోబస్తులో విధులు నిర్వర్తించారు. ఆదివారం మధ్యాహ్నం సీతారాంబాగ్ నుంచి ప్రారంభమైన యాత్ర రాత్రి సుల్తాన్‌బజార్ హనుమాన్ వ్యాయామశాల వరకు సాగింది. ప్రధాన ఊరేగింపులు మంగళ్‌హాట్, బేగంబజార్‌చత్రీ, సిద్ధిఅంబర్‌బజార్, గౌలిగూడ కమాన్, గురుద్వారా, పుత్లీబౌలి చౌరస్తా, కోఠి ఆంధ్రబ్యాంక్ మీదుగా సుల్తాన్‌బజార్‌లోని హనుమాన్ వ్యాయామశాల వద్దకు చేరుకున్నాయి. ఈ మొత్తం యాత్రలో శాంతిభద్రతల పరిస్థితిని కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి ఎప్పటికప్పుడు సీపీ సీవీ ఆనంద్, ఆర్టీసీ, ఆర్‌అండ్‌బీ, జీహెచ్‌ఎంసీ, ఈఎంఆర్‌ఐ, అగ్నిమాపకశాఖ, విద్యుత్‌శాఖ, ట్రాఫిక్ పోలీసుల అధికారులతో కలిసి సీసీ కెమెరాల ద్వారా వీక్షిస్తూ క్షేత్రస్థాయిలో ఉన్న అధికారులకు సూచనలిచ్చారు.

# ఫార్మా నిర్వాసితుల ప్లాట్లకు..

# 'గ్రీన్‌ఫీల్డ్' గండం




ఫార్మా ప్లాట్ల కోసం ఏర్పాటు చేసిన టీఎస్ఐఐసీ బోర్డు

- పది రోజుల్లో ప్లాట్ల పంపిణీపై అయోమయంలో రైతులు, లబ్ధిదారులు
- ప్లాట్ల లేఅవుట్ గుండా 300 ఫీట్ల రోడ్డు..!
- నిర్వాసితులకు ఎకరాకు 121 గజాల ఇంటి స్థలం
- ఇప్పటికే సర్టిఫికెట్లు పంపిణీ చేసిన గత బీఆర్ఎస్ ప్రభుత్వం
- స్థలం ఇవ్వకుంటే సర్వే అడ్డుకుంటామని అధికారులపై రైతుల ఒత్తిడి
- త్వరలో ప్లాట్ల డ్రా తీస్తామంటున్న అధికారులు
- లబ్ధిదారుల కోసం మరికొంత అదనపు లేఅవుట్ తప్పనిసరి!

**ఫార్మా సిటీ ఏర్పాటులో భాగంగా నిర్వాసితులకు ప్లాట్ల పంపిణీపై పలు రకాల అనుమానాలు రైతుల్లో వ్యక్తమవుతున్నాయి. ప్లాట్ల లేఅవుట్ గుండా 300 ఫీట్ల రోడ్డు నిర్మాణాన్ని ప్రభుత్వం తలపెట్టడంతో పాట్ల పంపిణీకి ఆటంకంగా మారింది. ఫార్మా భూ నిర్వాసితులకు పరిహారంతో పాటు అదనంగా సర్వే నం.90, 91లలో ఎకరాకు 121 గజాల చొప్పన పాట్లను ఇచ్చేందుకు అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం హెచ్ఎండీఏ వెంచర్‌ను ఏర్పాటు చేసింది. ఇప్పటికే లబ్ధిదారులకు పాట్లకు సంబంధించిన పట్టాలను గత బీఆర్ఎస్ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి 2023లో అందజేసిన విషయం తెలిసిందే. యాచారం మండలంలోని మేడిపల్లి గ్రామంలో మూడు రోజుల క్రితం గతంలో సేకరించిన ఫార్మా భూములను సర్వే చేసి, హద్దులు గుర్తించి, ఫెన్సింగ్ వేసే పనిని అధికారులు చేపట్టారు. స్థలం ఇవ్వకుంటే సర్వే అడ్డుకుంటామని అధికారులపై రైతులు ఒత్తిడి తెస్తున్నారు. దీంతో వారం నుంచి పది రోజుల్లోగా డ్రా తీసి లబ్ధిదారులకు ప్లాట్లను పంపిణీ చేయనున్నట్లు ఆర్డీవో అనంతరెడ్డి రైతులకు హామీ ఇవ్వడంతో రైతులు సర్వేను అంగీకరించారు. ప్రస్తుతమున్న లేఅవుట్‌లో సుమారు 200 ప్లాట్ల వరకు రోడ్డు నిర్మాణంలో కోల్పోవలసి వస్తుందని సమాచారం. దీంతో రోడ్డు నిర్మాణంలో కోల్పోతున్న ప్లాట్ల కోసం మళ్లీ అదనపు లేఅవుట్ తయారు చేయాల్సి రావడంతో అధికారులకు తలనొప్పిగా మారింది. ప్రస్తుత లేఅవుట్ వెనకాల ఉన్న సుమారు 67 ఎకరాల స్థలంలో అదనపు లేఅవుట్ చేపట్టనున్నట్లు తెలుస్తున్నది.**

**- యాచారం, ఏప్రిల్ 6**

ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 300 ఫీట్ల రోడ్డు నిర్మాణం లేఅవుట్ గుండా తలపెట్టడంతో ప్లాట్ల పంపిణీకి ఆటంకంగా మారింది. దీంతో ప్రస్తుతమున్న లేఅవుట్‌లో సుమారు 200 ప్లాట్ల వరకు రోడ్డు నిర్మాణంలో కోల్పోవలసి వస్తుందని సమాచారం. దీంతో రోడ్డు నిర్మాణంలో కోల్పోతున్న ప్లాట్ల కోసం మళ్లీ అదనపు లేఅవుట్ తయారు చేయాల్సి రావడంతో అధికారులకు తలనొప్పిగా మారింది. ప్రస్తుత లేఅవుట్ వెనుకాల ఉన్న సుమారు 67 ఎకరాల స్థలంలో అదనపు లేఅవుట్ చేపట్టనున్నట్లు తెలుస్తున్నది. అయితే దానికి సమయం పట్టే అవకాశాలు ఉన్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.

### సర్వేను అడ్డుకుంటాం

లబ్ధిదారులు తమ ప్లాట్లు పంపిణీ చేయాలని ఒత్తిడి తేవడం.. లేఅవుట్ పూర్తి స్థాయిలో అందుబాటులో లేకపోవడంతో అధికారులకు ఎటూ పాలుపోవడంలేదు. త్వరలో ప్లాట్లు పంపిణీ చేయకపోతే ఫార్మా భూముల సర్వేను ఎక్కడ అడ్డుకుంటారోనని అటు పోలీసులు.. ఇటు అధికారులు ఆలోచనలో మునిగారు. పైగా సర్వే సుమారు 60 రోజులపాటు కొనసాగనుండటంతో అధికారుల్లో టెన్షన్ మొదలైంది. పది రోజుల్లోగా ప్లాట్లు పంపిణీ చేయకపోతే సర్వేను అడ్డుకునేందుకు రైతులు సైతం సిద్ధంగా ఉన్నారు. ముందుగా డ్రా తీసి తరువాత ప్లాట్ల కబ్జా ఇవ్వాలని అధికారులు యోచిస్తున్నారు. లేదా ముందుగా అందుబాటులో ఉన్న వాటిని కబ్జా ఇచ్చి మిగతావి తరువాత ఇచ్చేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. దీంతో అధికారులు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారోనని రైతులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఇదంతా బాగానే ఉన్న అసలు సమస్య మళ్లీ మొదటికొచ్చింది. జిల్లాలోని కందుకూరు మండలం మీర్‌ఖాన్‌పేట సమీపంలోని బేగరికంచె (బల్జగూడ)లో ఫార్మా భూనిర్వాసితుల కోసం లేఅవుట్ చేసిన విషయం తెలిసిందే.. ఈ లేఅవుట్లో బ్లాకులవారీగా ప్లాట్ల తయారీ, రోడ్ల నిర్మాణం, కల్వర్టుల నిర్మాణం తదితర అభివృద్ధి పనులు ముమ్మరంగా కొనసాగుతున్నవి.

### 14,000 ఎకరాల్లో భూముల సేకరణ

జిల్లాలోని యాచారం, కందుకూరు మండలాల్లో ముచ్చర్ల కేంద్రంగా ప్రపంచంలోనే అతిపెద్ద హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీని ఏర్పాటు చేసేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2017లో శ్రీకారం చుట్టింది. దీని కోసం కొంత మేరకు భూసేకరణ సైతం అప్పటి సర్కారు చేపట్టింది. హైదరాబాద్‌కు సమీపంలో 19,333 ఎకరాల్లో ఫార్మాసిటిని ఏర్పాటు చేసేందుకు తెలంగాణ తొలి ముఖ్యమంత్రి సీఎం కేసీఆర్ శ్రీకారం చుట్టారు. దీనికి ఇప్పటికే జాతీయ పెట్టుబడి, తయారీ జోన్ (నిమ్జ్) హోదాను కేంద్రం కల్పించింది.

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అప్పటి టీఎస్ఐఐసీ (రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ) రైతుల నుంచి సుమారు 14,000 ఎకరాలకు పైగా పట్టా, అసైన్డ్ భూములను సేకరించింది. ఫార్మాసిటీలో భూములు కోల్పోయిన రైతులకు ముందుగా ఎకరాకు పట్టా భూమికి రూ.12.50 లక్షలు, అసైన్డ్ భూమికి రూ.7.70 లక్షలు, తరువాత రైతుల డిమాండ్ మేరకు పట్టాకు రూ.16 లక్షలు, అసైన్డ్‌కు రూ.8 లక్షల పరిహారాన్ని అందజేసింది. ఇంకా 2,500 ఎకరాల భూమికి సంబంధించి కోర్టులో కేసులు ఉండటం వలన పరిహారం చెల్లించలేకపోయింది. కొంత మంది రైతులు ఫార్మాసిటీకి వ్యవసాయ భూములను ఇవ్వబోమని స్పష్టం చేశారు. దీంతో ఈ భూములపై గత కొంతకాలంగా ప్రభుత్వానికి రైతులకు మధ్య పోరాటం కొనసాగుతున్నది.



ఫార్మాసిటీ రోడ్డు

### ఇప్పటికే లబ్ధిదారుల జాబితా విడుదల

యాచారం మండలంలోని మేడిపల్లి, నానక్‌నగర్, తాటిపర్తి, కుర్మిద్ద గ్రామాలకు చెందిన లబ్ధిదారుల జాబితాను అధికారులు గత జనవరిలోనే విడుదల చేశారు. ఆయా గ్రామపంచాయతీ కార్యాలయాల్లో ప్లాట్ల లబ్ధిదారుల పూర్తిస్థాయి జాబితాను రైతులకు అందుబాటులో ఉంచారు. గత సంక్రాంతికే లాటరీ ద్వారా లబ్ధిదారులకు ప్లాట్లను కేటాయించనున్నట్లు ప్రచారం జరిగింది. ఫార్మాసిటీ ఏర్పాటుకు భూములు కోల్పోయిన రైతుల కోసం జిల్లాలోని కందుకూరు మండలం మీర్‌ఖాన్‌పేట సమీపంలోని బేగరికంచె(బల్జగూడ)లో ఫార్మా భూనిర్వాసితుల కోసం హెచ్ఎండీఏ లేఅవుట్‌ను ఏర్పాటు చేశారు. 620 ఎకరాల్లో ఏర్పాటు చేసిన హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ లేఅవుట్‌లో బ్లాకులవారీగా ప్లాట్లను తయారు చేశారు. అందులో అభివృద్ధి పనులు సైతం ముమ్మరంగా కొనసాగుతున్నాయి. గత సంక్రాంతికే లబ్ధిదారులకు ప్లాట్లు పంపిణీ చేసేందుకు అధికారులు ప్రణాళికలు రూపొందించినప్పటికీ నేటికీ నెరవేరకుండా పోయింది. నేరుగా ప్రభుత్వమే రైతుల పేరిట రిజిస్ట్రేషన్ చేసి డాక్యుమెంట్లు ఇవ్వనున్నట్లు అధికారులు తెలిపినప్పటికీ అది కలగానే మిగిలింది. ఇప్పటికైనా ప్లాట్లు పంపిణీ చేస్తారా అంటూ లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు.

### నిర్వాసితులకు ఎకరాకు 121 గజాల ప్లాటు

ఫార్మా భూ నిర్వాసితులకు పరిహారంతో పాటు అదనంగా కందుకూరు మండలం మీర్‌ఖాన్‌పేట గ్రామ సమీపంలోని బేగరికంచె(బల్జగూడ) వద్ద సర్వే నం.90, 91లలో ఎకరాకు 121 గజాల చొప్పున పాట్లను ఇచ్చేందుకు అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం హెచ్ఎండీఏ వెంచర్‌ను ఏర్పాటు చేసింది. ఇప్పటికే లబ్ధిదారులకు ప్లాట్లకు సంబంధించిన పట్టాలను గత బీఆర్ఎస్ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి 2023లో అందజేసిన విషయం తెలిసిందే. బీఆర్ఎస్ హయాంలోనే లబ్ధిదారులకు ప్లాట్లు అందజేయాలని అప్పటి ప్రభుత్వం భావించింది. బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు లాటరీ ద్వారా ప్లాట్లు కేటాయించే సమయంలోనే అసెంబ్లీ ఎన్నికల కోడ్ వచ్చింది. దీంతో పాట్ల పంపిణీ ప్రక్రియ నిలిచిపోయింది. యాచారం, కందుకూరు, కడ్తాల్ మండలాలకు సంబంధించిన భూనిర్వాసితులకు ఇళ్ల స్థలాలకు సంబంధించి పట్టాలను ఇప్పటికే అందజేసింది. దీని కోసం కందుకూరు మండలం మీర్‌ఖాన్‌పేట సమీపంలో బల్జగూడ ప్రాంతంలో సుమారు 622 ఎకరాల్లో హెచ్ఎండీఏ వెంచర్‌ను ఏర్పాటు చేసింది. ఇప్పటికే అక్కడ భూమి చదును చేసి బ్లాకులవారీగా ప్లాట్లను తయారు చేసి, రోడ్ల నిర్మాణం సైతం చేపట్టారు. ప్లాట్ల పక్కనే నయా నగరి (ఫోర్త్ సిటీ) నిర్మాణానికి సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేసిన విషయం తెలిసిందే.. ప్రస్తుతం పనులు సైతం శరవేగంగా కొనసాగుతున్నాయి. దీంతో రైతులకు ఫార్మా ప్లాట్లపై ఆశలు చిగురిస్తున్నాయి.

### యాచారం మండలంలో 3745 ప్లాట్లు

యాచారం, కందుకూరు, కడ్తాల్ మండలాలకు చెందిన 5720 మంది రైతులకు ప్లాట్లు పంపిణీ చేయనున్నారు. ఇందులో యాచారం మండలంలోని నాలుగు గ్రామాలకు కలిపి ఎకరాకు 121 గజాల చొప్పున మొత్తం 3745 ప్లాట్లు కేటాయించారు. ఇందులో కుర్మిద్దకు 1240, నానక్‌నగర్ 359, మేడిపల్లి 1601, తాటిపర్తికి 545 ప్లాట్లు మంజూరు చేశారు. ప్లాట్లకు సంబంధించిన పూర్తి జాబితాను ఆయా గ్రామపంచాయతీ కార్యాలయాల్లో ఇప్పటికే నోటీసు బోర్డుల్లో రైతులకు అందుబాటులో ఉంచారు. ఫార్మా ప్లాట్ల లబ్ధిదారులు కందుకూరు మండలంలో మీర్‌ఖాన్‌పేట, బేగరికంచె, పంజాగూడ, సాయిరెడ్డిగూడ, అన్నోజీగూడ, ముచ్చర్ల, సార్లరావులపల్లి, కడ్తాల్ మండలంలో పల్లెచెల్కతండా గ్రామాలకు చెందిన రైతులు ఉన్నారు. త్వరలో ఇండ్ల స్థలాలు పంపిణీ చేసి, లాటరీ విధానం ద్వారా ప్లాట్లు కేటాయించి మహేశ్వరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రైతుల పేరిట రిజిస్ట్రేషన్ చేసి ప్లాట్లు అప్పగించాలని రైతులు కోరుతున్నారు.

### ప్లాట్లు పంపిణీ చేయాలి



ఫార్మా భూ నిర్వాసితుల కోసం కేటాయించిన ఇంటి స్థలాలను ప్రభుత్వం వెంటనే లబ్ధిదారులకు అందజేయాలి. సర్టిఫికెట్లు కలిగిన ప్రతి రైతుకు ఎకరాకు 121 గజాల చొప్పున ఇంటి స్థలాలను కేటాయించి ప్రభుత్వమే రిజిస్ట్రేషన్ చేయించి ఇవ్వాలి. లాటరీ ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేసి ప్లాట్లు కేటాయించాలి. హెచ్ఎండీఏ వెంచర్‌లో వాటర్ ట్యాంకులు, బడి, పార్కులు, విద్యుత్, భూగర్భ డ్రైనేజీ, రోడ్లను కాంగ్రెస్ సర్కారు ఏర్పాటు చేయాలి. అధికారులు రైతులను ఎలాంటి అయోమయానికి గురిచేయొద్దు.

**- మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, ఇబ్రహీంపట్నం**

### ప్లాట్లు ఇస్తేనే భూములిస్తం



ప్రభుత్వం మాకివ్వాల్సిన ప్లాట్లను వెంటనే ఇవ్వాలి. ప్లాట్లు ఇవ్వకుంటే మా భూములు సర్కారుకు ఇవ్వం. మా భూముల్లో కంచె వేయకుండా అడ్డుకుంటాం. ప్లాట్లు ఇచ్చే వరకు మా భూముల్లో పంటలు వేసుకుంటాం. ప్లాట్లు ఇచ్చినంకనే పోలీసోళ్లు, సర్కారోళ్లు మా భూముల దగ్గరికి రావాలి. మాకు గైరాన్ భూమికి డబ్బులు రాలేదు. మాకు డబ్బులొచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. ప్లాట్లు ఇస్తారని ఎప్పటి నుంచో ఎదురు చూస్తున్నం. ఈసారైనా ఆఫీసర్లు మాట తప్పకుండా ప్లాట్లు ఇవ్వాలి.

**- నర్సింహ నాయక్, రైతు, పల్లెచెల్కతండా**

### త్వరలో ప్లాట్ల కేటాయింపు



భూనిర్వాసితులకు ప్లాట్లను డ్రా పద్ధతిలో త్వరలోనే కేటాయించేందుకు కృషి చేస్తున్నాం. ప్లాట్లకు సంబంధించిన లబ్ధిదారుల పూర్తి వివరాలను ఇప్పటికే గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో అందుబాటులో ఉంచాం. అర్హులైన లబ్ధిదారులకు ఎకరాకు 121 గజాల చొప్పున ప్లాట్లను ప్రభుత్వమే రైతుల పేరుపై మహేశ్వరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించి రైతులకు డాక్యుమెంట్లు ఇచ్చేందుకు యత్నిస్తున్నది. రైతులెవరూ ఆందోళన చెందొద్దు. ప్రతి ఒక్కరికీ ప్లాట్లను అందజేసేందుకు అన్ని విధాలుగా కృషి చేస్తాం.

**- అనంతరెడ్డి, ఆర్డీవో, ఇబ్రహీంపట్నం**



బాటసింగారం పండ్ల మార్కెట్‌కు పెద్దఎత్తున వచ్చిన మామిడికాయలు

## పోటెత్తిన మామిడి

- రికార్డుస్థాయిలో బాటసింగారం పండ్ల మార్కెట్‌కు మామిడికాయలు
- 1,50,000 మెట్రిక్ టన్నులు వస్తాయని అధికారుల అంచనా
- 70 శాతానికి పైగా ఇతర రాష్ట్రాలకు ఎగుమతి

రంగారెడ్డి, ఏప్రిల్ 6 (నమస్తే తెలంగాణ) : బాటసింగారంలోని పండ్ల మార్కెట్‌కు ఆరంభంలోనే రికార్డు స్థాయిలో మామిడికాయలు వస్తున్నాయి. ముఖ్యంగా తెలంగాణ, ఏపీలోని పలు ప్రాంతాలతో పాటు కృష్ణా, కడప జిల్లాల నుంచి మామిడికాయల లారీలు పోటెత్తుతున్నాయి. శనివారం ఒక్క రోజే 300 ట్రక్కుల్లో సుమారు 7 వేల టన్నుల మామిడికాయలు రావడం విశేషం. సీజన్ ఆరంభంలోనే పెద్ద ఎత్తున మామిడికాయలు రావడంతో సీజన్ చివరి వరకు కనీసం 1.50 లక్షల మెట్రిక్ టన్నుల మామిడి వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. అందువల్ల విక్రయాలకు వచ్చే వ్యాపారులు, కొనుగోలుదారులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఈ మార్కెట్‌కు వస్తున్న మామిడికాయల్లో సుమారు 70 శాతం దేశంలోని వివిధ ప్రాంతాలకు ఎగుమతి అవుతున్నాయి. ముఖ్యంగా ఢిల్లీ, పంజాబ్, రాజస్థాన్, హర్యానా, ఉత్తర్‌ప్రదేశ్, మధ్యప్రదేశ్ వంటి రాష్ట్రాలకు వెళ్తున్నాయి. మామిడి క్రయవిక్రయాలు రికార్డుస్థాయిలో జరుగుతుండడంతో మార్కెట్ ఆదాయం కూడా గణనీయంగా పెరుగుతున్నది.

## నడిరోడ్డుపై బండరాయితో మోది..
## గర్భవతిపై భర్త హత్యాయత్నం


కొన ఊపిరిలో బాధితురాలు



శేరిలింగంపల్లి, ఏప్రిల్ 6: నడిరోడ్డుపై గర్భవతిగా ఉన్న భార్యను బండరాయితో మోది చంపేందుకు యత్నించాడు భర్త. తీవ్రంగా గాయపడిన బాధితురాలు కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్నది. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటన గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... వికారాబాద్‌కు చెందిన ఎండీ బస్రత్ (32), షబానా పర్వీన్(22) దంపతులు హఫీజ్‌పేట్ ఆదిత్యనగర్‌లో ఉంటున్నారు. ప్రస్తుతం షబానా పర్వీన్ రెండు నెలల గర్భిణి కాగా, మార్చి 29న పర్వీన్ అస్వస్థతకు గురికావడంతో కొండాపూర్ రాఘవేంద్రకాలనీలోని ఓ ఆసుపత్రిలో చేర్పించారు. పర్వీన్‌ను ఏప్రిల్ 1న రాత్రి డిశ్చార్జ్ చేశారు. ఆసుపత్రి బయటకు రావడంతోనే, హాస్పిటల్ ముందే భార్యాభర్తలకు గొడవ జరిగింది. నడిరోడ్డుపై పెనుగులాటలో కిందపడిన పర్వీన్‌పై బస్రత్ 10 నుంచి 12సార్లు రాయితో మోదడంతో పర్వీన్ తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితికి వెళ్లింది. చనిపోయిందని భావించిన బస్రత్.. అక్కడి నుంచి పారిపోయాడు. గచ్చిబౌలి పోలీసులు కొన ఊపిరితో ఉన్న పర్వీన్‌ను చికిత్స కోసం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. కోమాలో ఉన్న పర్వీన్ నిమ్స్‌లో చికిత్స పొందుతున్నది. పోలీసులు నిందితుడు బస్రత్‌ను ఈ నెల 3న అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

# కాంగ్రెస్ సర్కారు వచ్చాకే తాగునీటి కష్టాలు

- అరకొరగా మిషన్ భగీరథ నీటి సరఫరా
- నీళ్లు లేక కొట్టుమిట్టాడుతున్న కొట్టంగుట్టతండా ప్రజలు
- కూలీ పనులకు వెళ్లకుండా నీటి కోసం తంటాలు
- అపరిశుభ్రంగా తాగునీటి ట్యాంకు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



అపరిశుభ్రంగా ట్యాంక్



బోరు ద్వారా నీటిని పట్టుకుంటున్న మహిళ

వికారాబాద్, ఏప్రిల్ 6 : మానవుని మనుగడలో ముఖ్యంగా తాగునీరు ఎంతో కీలకం. ఎండాకాలం వస్తే చాలు నీటి కోసం ఇబ్బందులు తలెత్తుతున్నాయి. వికారాబాద్ మున్సిపల్‌లో ఉన్నా అభివృద్ధిలో మాత్రం ఆమడ దూరంలో కొట్టంగుట్టతండా ఉన్నది. కాంగ్రెస్ సర్కారు వచ్చాక నిత్యం తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని తండావాసులు వాపోతున్నారు. తెలంగాణ రాకముందు ఎండాకాలం వస్తే చాలు తాగునీటి కోసం చిన్నారులు, పెద్దలు తండాకు దూరంగా గుట్టల మధ్య ఉన్న చెలిమ నీటిని తెచ్చుకొని ఇబ్బందులు పడుతూ కాలం గడిపారు. ఇబ్బందులు తీర్చాలని అప్పట్లో ఎన్నో ప్రభుత్వాలను కోరారు. బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాక తండాల్లో ప్రతి ఇంటికి మిషన్ భగీరథ నీటిని అందించి నీటి సమస్యను కేసీఆర్ తీర్చారు. తమ కష్టాలు తీరాయనుకొని సంతోషంగా ఉన్నారు. ఇప్పుడు మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చీ రాగానే నీటి సమస్యలు ఏర్పడుతున్నాయి.

తండాలో దాదాపు 60 కుటుంబాలు, 100కు పైగా జనాభా ఉంటుంది. తండాకు అరకొరగా నీటి సరఫరా జరుగుతుండటంతో నీరు సరిపోక ఇబ్బందులు పడుతున్నారు. తాగునీటి ట్యాంక్ కడగకపోవడంతో చెత్తాచెదారం నిండుకున్నది. ఆ నీటినే తాగాల్సి వస్తున్నది. గతంలో వేసిన బోరు నుంచి నీరు సక్రమంగా రాకపోవడంతో నీటి కష్టాలు మళ్లీ మొదలయ్యాయి. కూలీ పనులకు సైతం వెళ్లకుండా నీటి కోసం నీటి కోసం పడిగాపులు కాయాల్సి వస్తున్నది. శుక్రవారం పూర్తిగా తండాకు నీరు రాకపోవడంతో మరింత ఇబ్బందులు ఏర్పడ్డాయి. పశువులకు తాగేందుకు నీళ్లు లేక అల్లాడుతున్నాయి. గిరిజనుల సమస్యలు పట్టించుకునే నాథుడే కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు తండా వైపు కన్నెత్తి కూడా చూడడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కనికరించి కొట్టంగుట్టతండా తమకు పుష్కలంగా నీటిని అందించాలని ప్రజలు కోరుతున్నారు.

### నీళ్లు లేక ఇబ్బందులు పడుతున్నాం



తండాను గత కొన్ని రోజులుగా నీటి సమస్య వెంటాడుతున్నది. ట్యాంకును కడగక పోవడంతో చెత్త, పురుగులు వస్తున్నాయి. రెండు మూడు, బిందెలు మాత్రమే నీళ్లు వస్తున్నాయి. శుక్రవారం రోజు మొత్తానికే నీరు రాలేదు. బోరులో నుంచి నీరు సక్రమంగా రాకపోవడంతో నీటి కోసం ఇబ్బందులు పడుతున్నాం. తండాలో నీటి సమస్య ఉన్నా ఎవరూ పట్టించుకోవడంలేదు. తండావాసుల బతుకులు మారేటట్లు లేవు.

**- వల్కీబాయి, కొట్టంగుట్టతండా, వికారాబాద్**

### మళ్లీ నీటి సమస్యలు



బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మిషన్ భగీరథ నీరు ఇంటింటికీ సరిపడా అందేవి. కాంగ్రెస్ సర్కారు వచ్చినంక నీరు సరిపోక ఇబ్బందులు పడుతున్నాం. ట్యాంకు ఉన్నా.. అందులో నీరు లేక ఉండటం లేదు. నీటిని దూరంగా ఉన్న బోరు నుంచి తెచ్చుకోవాల్సి వస్తున్నది. నీటిని మోసుకొస్తుంటే చేతకాక ఇబ్బందులు పడుతున్నాం. బోర్లలో కూడా నీరు సక్రమంగా రాకపోవడంతో పడిగాపులు కాయాల్సి వస్తున్నది.

**- జాంగీబాయి, కొట్టంగుట్టతండా, వికారాబాద్**

### నీటిని తెచ్చుకోవాలంటే కూలీ పనులు మానుకోవాల్సిందే..



గత కొన్ని రోజులుగా నీటి సమస్య వేధిస్తున్నది. ట్యాంకులోకి నీరు రాక, అర కొర నీటితోనే తండాకు నీటిని సరఫరా చేస్తున్నారు. ట్యాంకులో నీరు అడుగంటడంతో అందులో ఉన్న చెత్త, పురుగులు ఇండ్లలోకి వస్తున్నాయి. ఎవరు కూడా ట్యాంకును కడగడంలేదు. ట్యాంకు నుంచి కనెక్షన్లు సక్రమంగా లేకపోవడంతో కింద ఉన్న ఇండ్లల్లోకి మాత్రమే నీరు ఎక్కువగా వస్తాయి. పైకి ఉన్న ఇండ్లకు నీరు రాక ఇబ్బందులు పడుతున్నాం. నీటిని తెచ్చుకోవాలంటే కూలీ పనులు మానుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. మా సమస్యను ఏ అధికారీ పట్టించుకోవడంలేదు.

**- గోపాల్, కొట్టంగుట్ట తండా, వికారాబాద్**